# సత్యవాక్కు

పోస్టు బాక్స్ - 80, కాకినాడ
ఆంధ్రప్రదేశ్ - 533 001.
ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547
ఎడిటర్ : జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 43 నవంబరు - 2021 సంచిక -4

## "నీవు క్రైస్తవుడవైతివి గనుక..."

క్రైస్తవుడనగా క్రీస్తుకు చెందిన వాడని గత సంచికలో నేర్చుకొని యున్నాము. క్రీస్తునందు విశ్వసించి, బాప్తిస్మము పొందినవాడు క్రైస్తవుడగు ననికూడ నేర్చుకొనియున్నాము. క్రైస్తవుడయినవాడు సత్యమునకు విధేయుడుగుటచేత తన మనస్సును పవిత్రపరచుకొనినవాడని అపొ. పేతురు పలికెను. (1పేతురు 1:23). ఒకడు క్రైస్తవుడయిన తరువాత పొందే దీవెనలు, అతనిలో కలిగే మార్పు, అతని బాధ్యతలను గూర్చి ఈరోజు కొంత తెలిసికొందము.

నీవు క్రైస్తవుడయితివి గనుక నీవు పొందేది యేమిటి? అని మనము అడుగవచ్చును.

నీవు క్రైస్తవుడయితివి గనుక రక్షణ పొందెదవు. క్రైస్తవుడగుటలో ఒకడు బాప్తిస్మము పొందిన తరువాత రక్షింపబడునని యేసు వాగ్దానము చేసెను (మార్కు 16:16). బాప్తిస్మము పొందకముందే నీవు రక్షింపబడితివి అని కొందరు నీకు బోధింప ప్రయత్నింతురుగాని, లేఖనములు అట్లు బోధిం

చుట లేదు. రక్షింపబడుటకు బాప్తిస్మము అక్కరలేదు అని కొందరు నీకు బోధింప ప్రయత్నింతురు గాని, "బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించు చున్నది" యని 1పేతురు 3:21 బోధించుచున్నది.

నీవు క్రైస్తవుడయినప్పుడు పాప క్షమాపణను పొందెదవు. మారు మనస్సుపొంది బాప్తిస్మము పొందిన విశ్వాసి పాపములు క్షమింపబడునని అపొ.కా. 2:38 బోధించు చున్నది. బాప్తిస్మము పాపక్షమాపణ నిమిత్తము యేసు నామమున పొందవలెను. నీవు బాప్తిస్మము పొందినప్పుడు నీ పాపములు కడిగివేయబడును (అపొ. కా. 22:16). సత్య సువార్తకు విధేయు లవుట ద్వారా మన మనస్సులను పవిత్ర పరచుకొందము అని 1 పేతురు 1:23లో వ్రాయబడియున్నది. మనలను పవిత్రపరచేది యేసుక్రీస్తు రక్తమేగాని మరొకటి కాదు (ప్రక 1:5,6).

నీవు క్రైస్తవుడవైనప్పుడు పరిశుద్ధాత్మ అను వరమును పొందెదవు. మీరు మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందుడి, అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందెదరు అని అపొ. కా. 2:38లో వాగ్దానము చేయబడెను. ఒకడు క్రైస్తవుడయిన తరువాత పరిశుద్ధాత్ముడు అతనిలో నివసించును. ఈ ఆత్మ మన స్వాస్థ్యము నకు సంచకరువుగా ఉన్నాడు (ఎఫెసీ 1:14). ఆయన మన రక్షణను ముద్ర వేసి యున్నాడు (ఎఫెసీ 4:30). క్రైస్తవులయిన తరువాత మనము దేవుని కుమారులమని సాక్ష్యమిచ్చుటకు గాను ఆయన తన ఆత్మను మన హృదయములలోనికి పంపును అని గలతీ 4:6లో వ్రాయబడి యున్నది. దేవుని ఆత్మ మనలో నివసించును. మనచేత అద్భుత కార్యములనిప్పుడు చేయించడుగాని, ఆత్మఫలములను,

అనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము మొదలగువాటిని మన జీవితములో ఫలింపజేయును (గలతీ 5:22).

**నీవు క్రైస్తవుడయిన యెడల పాపము నుండి విడుదలను పొందెదవు.** పాపము ఒకని బానిసగా చేయును (యోహాను 8:34). అయితే సత్యము స్వతంత్రులనుగా చేయును (యోహాను 8:32). సత్యమునకు విధేయులగుట ద్వారా, సత్యవాక్యోపదేశ క్రమమునకు లోబడుటద్వారా, అనగా యేసునందు విశ్వసించి, మారుమనస్సుపొంది, ఒప్పుకొని, బాప్తిస్మము పొందుటద్వారా మనము పాపమునుండి విడుదల పొందెదము (రోమా6:16-18).

**నీవు క్రైస్తవుడవయిన తరువాత సంతోషముతో నీ కాలమును గడుపుదువు.** పాపభారము తొలగించబడెను గనుక మహదానందముతో దేవుని సేవ చేయగలవు.

నీవు క్రైస్తవుడవయిన తరువాత నీవేమగుదువు అనే ప్రశ్నను మనము వేసికొనవచ్చును.

మొదటిగా నీవు క్రీస్తు శరీరములో ఒక సభ్యుడవగుదువు (1కొరింథీ 12:13). ఆ శరీరమే సంఘము (ఎఫెసీ 1:22, 23; కొలస్స 1:18). క్రీస్తే తన సంఘమునకు శిరస్సు గనుక క్రీస్తు శరీరములో యుండుటవలన శిరస్సుతో మనము కలసియుందుము. ఆ శరీరములో మనము దేవునితో సమాధానము కలిగియుందుము. "అయినను మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తుయేసునందు క్రీస్తు రక్తము వలన సమీపస్థులై యున్నారు. ఆయన మన సమాధానమై యుండి మీకును, మాకును ఉండిన ద్వేషమును... తన శరీరమందు కొట్టివేయుట చేత మధ్య గోడను పడగొట్టి మన ఉభయులను ఏకము చేసెను" అని అపో.పౌలు ఎఫెసీ 2:13,14లో వ్రాసెను.

నీవు క్రైస్తవుడయినప్పుడు దేవుని రాజ్యపౌరుడవగుదువు. ఒకడు నీటి మూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని యేసు బోధించెను (యోహాను 3:5). క్రైస్తవుడు నీటి మూలముగాను, ఆత్మమూలముగాను జన్మించినవాడు. క్రీస్తు సంఘమే దేవుని రాజ్యము (మత్తయి 16:18,19; హెబ్రీ 12:22-28). క్రీస్తే రాజై యున్నాడు. ఆయన రాజ్యములో క్రైస్తవులు పరజనులు, పరదేశులై యుండక పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును, దేవుని యింటివారునై యున్నారు (ఎఫెసీ 2:19). దేవుని రాజ్యములో పౌరులగుటవలన క్రైస్తవులు అంధకార సంబంధమైన శక్తుల నుండి విడుదల చేయబడి దేవుని రాజ్యములోనికి మార్చబడినవారై యున్నారు (కొలస్స 1:13, 14).

క్రైస్తవుడవైనప్పుడు నీవు దేవుని బిడ్డ యగుదువు. క్రీస్తు సంఘమే దేవుని కుటుంబము. క్రీస్తునందలి విశ్వాసము వలన క్రైస్తవులు దేవుని కుమారులై యున్నారు. దేవుని కుటుంబ సభ్యులగుటకుగాను వారు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినవారు. గలతీ 3:26,27లో యిట్లు వ్రాయబడి యున్నది: "యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు". దేవుని బిడ్డలుగా క్రైస్తవులు దేవుని ప్రార్థించే ఆధికారమును, ఆయన కృపాకటాక్షములను, ఆయన యిచ్చు దీవెనలను, పొందే భాగ్యమును కలిగి యున్నారు.

క్రైస్తవుడవయినప్పుడు నీవు దేవుని ద్రాక్షతోటలో ఒక పనివాడ వగుదువు. దేవునిసంఘమే దేవుని ద్రాక్షతోట. దానిలో క్రైస్తవులు కష్టపడి

పనిచేయవలెనుగాని నిద్రపోరాదు. మనము పనిచేయవలెనని, ఒకరితో నొకరు కలసి పనిచేయవలెనని, దేవునితో కలసి పనిచేయవలెనని 1కొరింధి 3:9 బోధించుచున్నది. దేవుని సేవ చేయుటలో గొప్ప ఆనందము కలుగును. "కన్నీళ్ళు విడుచుచు విత్తువారు సంతోషగానముతో పంట కోసెదరు. పిడికెడు విత్తనములు చేత పట్టుకొని యేడ్చుచు పోవు విత్తువాడు సంతోషగానము చేయుచు పనలు మోసికొని వచ్చును" అని దా.కీ.126: 5,6లో వ్రాయబడి యున్నది. క్రైస్తవులు తమ ప్రయాసము ప్రభువునందు వ్యర్థముకాదని యెరిగి, స్థిరులును, కదలనివారును, ప్రభువు కార్యాభివృద్ధి యందు ఎప్పటికిని ఆసక్తులై యుండ వలెనని హెచ్చరింప బడి యున్నారు (1 కొరింధీ 15:58). యేసు ప్రభువు మరల వచ్చునప్పుడు ప్రతివానికి వాని వాని క్రియల చొప్పున జీతమిచ్చును.

**నీవు క్రైస్తవుడయినప్పుడు దేవుని మందిరములో ఒక యాజకునిగాను, ఆరాధకునిగాను అగుదువు.** క్రైస్తవులు యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూల ములగు ఆత్మసంబంధమైన బలుల నర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు సజీవమైన రాళ్ళవలె సుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు అని అపొ. పేతురు వ్రాసెను (1 పేతురు 2:5). యాజకుల వలె క్రైస్తవులు దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుచు, ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వా ఫలముల నర్పించెదరు (హెబ్రీ 13: 15). వారు ఉపకారమును, ధర్మమును చేయుట మరచిపోరు. అట్టి యాగములు దేవునికిష్టమైనవి (హెబ్రీ 13:16). వారు తమ ధనమును, తమ శరీరములను కూడ దేవునికి సజీవ యాగముగా అర్పించుటకు ఎల్లప్పుడు సంసిద్ధులై యుందురు. అట్టి సేవ

యుక్తమైనది (ఫిలిప్పీ 4:18: రోమా 12:1).

నీవు క్రైస్తవుడయినప్పుడు దేవుని పెండ్లికుమార్తె సంఘములో సభ్యుడవ గుదువు. "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు" (ఎఫెసీ 5:23). అందువలన ఆయన సంఘములో యున్న ప్రతి సభ్యుడు పెండ్లి కుమార్తె యొక్క పవిత్రత పాడుకాకుండు నిమిత్తము తన్ను తాను పరిశుద్ధముగా యుంచుకొనవలెను. యీలోక స్నేహము దేవునితో వైరమని, యీలోక ముతో స్నేహము చేయగోరువాడు దేవునికి శత్రువగునని ప్రతి క్రైస్తవుడు యెరిగి పవిత్రమును, నిష్కళంకమైన జీవితమును జీవించవలెను.

నీవు క్రైస్తవుడయినందున అనేక ఆత్మీయాశీర్వాదములను క్రీస్తులో పొందగలవు. దానితోకూడ కొన్ని ఆత్మీయ బాధ్యతలు నీకు అప్పగింప బడి యున్నవి. నీవు యితరులను రక్షించుటకు రక్షింపబడితివని జ్ఞాపక ముంచుకొనుము. దేవునికై యెల్లప్పుడు కృషిచేయుము.

ఈ అంశములను మా తరువాత సంచికలో మరికొంత ధ్యానింతుము.

## పసిబిడ్డలు పాపముతో పుట్టలేదు!

పసిబిడ్డలు పాపముతో పుడతారని నమ్మేవారు కొందరున్నారు. రోమన్ కేథలిక్కులు, ఆంగ్లికన్ సంఘ స్థులు, ప్రెస్బిటేరియన్లు, లూథరన్లు మొదలగు వారు అట్లు నమ్ముతారు. అందువలన వీరిలో చాలమంది పసి పిల్లలకు చిలకరింపు (బాప్తిస్మము) ఇస్తారు. అయితే వారనుకొనుచున్నట్లు అది బాప్తిస్మము కాదు. దాని వలన పసివారు భద్రత కలిగియుండరు!

పసివారు పాపముతో పుడతారని నమ్మేవారు మాత్రమే గాక, అది లేఖనముల ప్రకారమైనదని వారు తలస్తారు. అయితే ఈ విషయంలో బైబిలు యేమిచెప్పుచున్నది? "అప్పుడు యెహోవా ఇంపయిన సువాసన నాఘ్రాణించి ఇకమీదట నరులను బట్టి భూమిని మరల శపించను ఎందుకనగా నరుల హృదయము వారి బాల్యము నుండి చెడ్డది. నేనిప్పుడు చేసిన ప్రకారముగా ఇకను సమస్త జీవులను సంహరింపను" అనెను (ఆది కా. 8:21). మనుష్యుని హృదయము పసితనము నుండి చెడ్డదా? [illegible]నది గ్రహింపుము. వాని జన్మ నుండి గాక వాని యవ్వనము నుండి (బాల్యము నుండి యని తెలుగులో అనువదించబడినది) గాని వాని యవ్వన దశ నుండి చెడ్డదియని బైబిలు చెప్పుచున్నది.

మరల ప్రవక్తయైన యిర్మియా కలము ద్వారా ఈ మాటలు గమనించుదము: "సిగ్గునొందిన వారమై సాగిలపడుదము రండి; మనము కనబడకుండ అవమానము మనలను మరుగుచేయును గాక; మన దేవుడైన యెహోవా మాట వినక మనమును మన పితరులును మన బాల్యము (యవ్వనము) నుండి నేటి వరకు మన దేవుడైన యెహోకు విరోధముగా పాపము చేసితిమి" (యిర్మియా 3:25). పరిశుద్ధాత్మప్రేరణ వలన మోషే యేమి వ్రాసాడో దానితో యిర్మియా కూడ ఆత్మప్రేరణ వలన అదే వ్రాసాడు.

పసివారు పాపముతో పుడతారని చెప్పే వారి కిష్టమైన లేఖన భాగము కీర్తన 51:5. అది యిట్లు చెప్పుచున్నది. "నేను పాపములో పుట్టిన వాడను, పాపములోనే నా తల్లి నన్ను గర్భము ధరించెను." దావీదు యొుక్క పాపములను గూర్చి ఈ లేఖనము చెబుతున్నదని వారు తలంచుదురు. అయితే ఆజ్ఞాతి క్రమమే పాపమని మన మెరుగుదుము (1యోహాను 3:4), ఈ పై వచనము దావీదును గూర్చి గాక అతని తల్లిని గూర్చి చెప్పుచున్నది.

దావీదు జన్మించక ముందు అతని తల్లి పాపములోయుండెను.

మరియొక పాత నిబంధన లేఖకుడు ఏమిచెప్పుచున్నాడో ఇప్పుడు గమనించుదాం : "పాపము చేయువాడే మరణమునొందును, తండ్రి యొక్క దోష శిక్షను కుమారుడు మోయుట లేదని కుమారుని దోషశిక్షను తండ్రి మోయడు. నీతిపరుని నీతి అనీతి పరునికే చెందును; దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును" (యెహెజ్కేలు 18:20). ఇప్పుడొక ప్రశ్న : క్రొత్తగా జన్మించిన శిశువు పాపము చేయునా? లేదు! క్రొత్తగా జన్మించిన శిశువు మాట్లాడలేదు, గ్రహించుకొనలేదు, పసి పిల్లలకు ఆకలి మాత్రం తెలియును. అంతకు మించి వారికేమి తెలియదు.

ఇప్పుడు క్రొత్త నిబంధనలో పసివారిని గూర్చి యేసు చెప్పిన ప్రతి మాటను గమనించుదుము! "తమ బిడ్డలను ముట్టుకొనవలెనని కొందరాయన యొద్దకు వారిని తీసికొని వచ్చిరి; అయితే శిష్యులు (వారిని తీసికొని వచ్చిన) వారిని గద్దించిరి. యేసు అది చూచి, కోపపడి – చిన్నబిడ్డలను నా యొద్దకు రానీయుడి. వారి నాటంక పరచవద్దు; దేవుని రాజ్యము ఈలాటి వారిదే" యనెను (మార్కు 10:13,14).

యేసు చెప్పిన మాటలను గమనించుము. వారిని నా యొద్దకు రానీయుడి, పరలోక రాజ్యము ఈలాటి వారిదే. చిన్నబిడ్డలు క్రైస్తవులని యేసు చెప్పుటలేదు. గాని చిన్నబిడ్డలు పవిత్రులు, అమాయకులు అని ఆయన చెప్పారు. చిన్నబిడ్డలు పాపముతో పుడతారని చెప్పే వారికి యేసు యొక్క మాటలకు చాల వ్యత్యాసమున్నది.

ఇప్పుడు మత్తయి 18:1-4ను చూచుకొందుము: "ఆ కాలమున శిష్యులు యేసునొద్దకు వచ్చి, పరలోక రాజ్యములో ఎవడు గొప్పవాడని అడుగగా – ఆయన యొక చిన్నబిడ్డను తన యొద్దకు పిలిచి, వారి మధ్యను నిలువబెట్టి యిట్లనెను – మీరు మార్పు

నొంది బిడ్డలవంటి వారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. కాగా ఈ బిడ్డవలే తన్ను తాను తగ్గించు కొను వాడెవడో వాడే పరరాజ్యములో గొప్పవాడు."

యిది గమనించదగిన లేఖన భాగము. "మీరు మార్పునొంది బిడ్డల వంటి వారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపలేరని" ఆయన చెప్పారు. తన శిష్యులు మార్పునొందా లని యేసు వారిని హెచ్చరించారు. వారి జీవితాల్లో మార్పు కలగాలి. చిన్న బిడ్డలు ఎట్లు పవిత్రులో వారు కూడ అట్లే పవిత్రులుగా యుండాలి. చిన్న బిడ్డలు తగ్గించుకొంటారు. అందువలన చిన్నబిడ్డల వలే తన్ను తాను తగ్గించు కొనువాడే పరలోక రాజ్యములో ప్రవేశించును. యిది చాల ప్రాముఖ్య మైన మాట!

మనము ఇంతవరకు చూచిన బైబిలు లేఖనములు పసిబిడ్డలు పాపులు గా పుట్టరని ఉద్ఘాటించుచున్నది. ప్రజలు తమ యౌవ్వనదశ పైబడి నుండి పాపము చేయువారని చెప్పు లేఖన భాగములనేకములున్నవి. "నీవు నాకు కఠినమైన శిక్ష విధించి యున్నావు. నా బాల్య (యవ్వన)కాలపు పాపము లను నాకు స్వాస్థ్యముగా నీవు విధించి యున్నావు" (యోబు 13:26). మరల "వారి యెముకలలో యౌవన బలము నిండి యుండును గాని అదియు వారితోకూడ మంటిలో పండుకొనును" (యోబు20:11). కీర్తనాకారుడు ఇట్లు వ్రాసాడు : "నా బాల్య (యవ్వన) పాపములను నా అతిక్రమములను జ్ఞాపకము చేసి కొనకుము. యెహోవా నీ కృపను బట్టి నీదయచొప్పున నన్ను జ్ఞాపకముంచు కొనుము". "ప్రభువా నా జన్మ పాపములను జ్ఞాపకముంచు కొనకుము" అను మాటలను మనము బైబిలులో ఎక్కడా చదువము. అవి బైబిలులో లేవు. ఒక వ్యక్తి పాపముతో పుడతాడు అని బోధించుట దేవునికి అన్యాయము చేసినయట్లే.

దేవుడు సృష్టినంతటిని ముగిం చిన తరువాత మనం ఆదికాండ ములో యేమి చదువుదుము? "దేవుడు తాను చేసిన పని యావత్తును చూచి నప్పుడు అది చాలమంచిగ యుండెను. అస్తమయమును ఉదయమును కలుగగా ఆరవదినమాయెను" (ఆది. కా. 1:31). ఆదామును దేవుడు నేలమంటి నుండి సృజించెనని మన మెరుగుదుము (ఆది.కా.2:7). హవ్వను ఆయన ఆదాము యొక్క ప్రక్కటెముక లలో ఒక దానిని నుండి సృజించెను (ఆది.కా.2:22) అయినను మానవ జాతి అంతయు దేవుని స్వరూపమున సృజింపబడెను.

ఒకడు రక్షింపబడకముందు తన పాపముల విషయమై మారుమనస్సు పొందాలని లేఖనముల నుండి మన మెరుగుదుము (లూకా 13:3; అపొ.కా.2:38; 3:19; 17:30). ఈ ఆజ్ఞను గూర్చి జాగ్రత్తగా ఆలోచించు దము. ఒకడు మారుమనస్సు పొందక ముందు అతడు యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించాలి (యోహాను 8:24). అయితే క్రొత్తగా జన్మించిన శిశువు యేసుక్రీస్తు నందు విశ్వాస ముంచగలడా? పసిపిల్లలకు యిది యేమీ తెలియదు. గ్రహించుకోడానికి వారికి సాధ్యము కాదు. వారు పవిత్రులు గనుక మారుమనస్సు పొందడానికి పాపములు యేమీ వారికి లేవు.

విచక్షణ జ్ఞానము కలిగిన వయస్సు వచ్చేసరికి అప్పుడు మాత్రమే ఒకడు విశ్వసించి మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందవలెను. దాని కంటెముందు పసిబిడ్డలు, చిన్నబిడ్డలు నశించిన స్థితిలో యుండరు. వారు యేసు యొక్క చేతులలో క్షేమముగా యుందురు.

**ముగింపు :** పసిపిల్లలు పాపముతో పుట్టరు. చిన్న బిడ్డలు పాపులు కారు. క్రీస్తు యొక్క దృష్టిలో వారు చాల ప్రశస్తమైన వారు. అట్లే తండ్రి యొక్క దృష్టిలో కూడ వారు

పాపులు కారు. దీనికి విరుద్ధముగా బోధించితే దేవునినే అబద్ధికునిగా చేయు వారమగుదుము. "ప్రతి మనుష్యుడును అబద్ధికుడగును గాని దేవుడు సత్యవంతుడు కాక తీరడు" (రోమా 3:4). దేవుని వాక్యమే సత్యము. యేసు దానిని ఉద్ఘాటించారు (యోహాను 17:17). దేవుని వాక్యాన్ని కలుషితము చేయువాడు నశించును గాక! ప్రకటన 22:18,19). అట్టి వారు దేవుని ఉగ్రతకు పాత్రులగుదురు. "జీవము గల దేవుని చేతిలో పడుట భయంకరము" (హెబ్రీ 10:31).

–డెన్నిస్ సంప్టర్

## రాజ్యము సంఘము ఒకటేనా?

బైబిలులో యున్న సంఘము నకు సరియైన పేరు లేదు. నిర్వచనము ను బట్టి సంఘము (ఎక్లేషియా) అనగా పిలువబడిన వారు. అనగా ఈ లోకములో నుండి దేవునితో సహవాస మును, విశ్వాసమును, సువార్తకు విధేయత చూపుట ద్వారా పిలువ బడిన వారు (హెబ్రీ 5:8,9; 2థెస్స 1:7–9).

**ఆయాపదములు ఒకే సంస్థ యొక్క వివిధ లక్షణములు బయలు పరచును :** సంఘము వివిధములుగా వర్ణించబడినది. సంఘ సభ్యుల యొక్క ఐక్యతను గమనించిన యెడల అది పిలువబడిన వారితో కూడిన సంస్థయై యున్నది. ఎఫెసీ పత్రిక యొక్క ముఖ్య ఉద్దేశ్యము యిది (ఎఫెసీ 1:23; 2:16; 3:6; 4:4; 12,16; 5: 23–30).

దేవుని వనిని గూర్చి ఆలోచించిన యెడల సంఘము ఒక ద్రాక్షతోటగా వర్ణించబడినది. పని వారు ఆత్మఫలములు ఫలించాలి (మత్తయి 20:1–16; గలతీ 5:22, 23).

సంఘసభ్యులు తండ్రియైన దేవునితో కలిగియుండు సంబంధ విషయములో అది దేవుని కుటుంబ ముగా వర్ణించబడినది (ఎఫెసీ 2:19; 3:15).

సంఘసభ్యులు అపవాదితో పోరాటానికి వచ్చేసరికి అది ఒక సైన్యము వలె వర్ణించబడినది (2 తిమో 2:3,4).

దాని ప్రభుత్వము విషయంలో అయితే అది ఒక రాజ్యముగా వర్ణించ బడినది. అది ఏకచ్ఛత్రాధిపతియైన క్రీస్తు చే పాలింపబడుచున్నది.

ఈ విషయాల్లో మనం గజిబిజి అయ్యిపోకూడదు. ఉదా: వివాహితుడ నైన నేను ఒక పురుషుడను, కుమారు డను, తండ్రిని, భర్తను, భారతీయుడను, పన్నుచెల్లించువాడను, ఉద్యోగిని, లేఖకుడను, క్రైస్తవుడను!.

అట్లే సంఘము కూడ వివిధ నామకరణములతో సంబోధింవ బడినది. అది

క్రీస్తు సంఘము (రోమా 16:16).
ప్రభువు యొక్క సంఘము (అపో.కా. 20:28).
క్రీస్తు శరీరము (ఎఫెసీ 4:12)
దేవుని సంఘము (1కొరింథీ 1:2)
జీవము గల దేవుని సంఘము (1 తిమోతి 3:15)
జ్యేష్ఠుల సంఘము (హెబ్రీ 12:23).

ఆయా పదములు పరస్పరముగా వాడబడినవి :

క్రొత్తనిబంధనలో సంఘము, రాజ్యము అను పదములు పరస్పరము గా ఒకదానికొకటి వాడబడినవి. యేసు ఇట్లు చెప్పారు : "మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును. పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ నేరవని నేను నీతో చెప్పుచున్నాను. పరలోక రాజ్యము యొక్క తాళములు నీకిచ్చెదను, నీవు భూలోకమందు దేని బంధించుదువో, అది పరలోక మందును బంధింపబడును, భూలోక మందు దేని విప్పుదువో అది పరలోక మందును విప్పబడును" (మత్తయి 16: 16-19).

ఇక్కడ యేసు ఒకే సంస్థను గూర్చి చెప్పుచున్నారనునది విదితమే. ఉదాహరణకు, 'నా ఇన్నోవా కారు నీకు

తెలియును, ఆ కారు తాళములివిగో". సంఘమును స్థాపింతునని యేసు పేతురుకు వాగ్దానము చేసారు. పేతురు కు, మిగతా అపొస్తలులకు కూడ ఆ సంఘములో ప్రవేశించు ద్వారమును తెరుచుటకు, దాని తాళపుచెవుల నిచ్చారు. రాజ్యము సంఘము ఒక్కటే కాకపోతే, రాజ్యము యొక్క తాళపు చెవులను సంఘముకు పేతురు వినియోగించకపోవును. కారు యొక్క తాళములను మోటారు సైకిలుకు వాడలేము గదా.

అనేకులు చెప్పురీతిగా రాజ్యము ఇంకా స్థాపించబడకపోతే, పేతురు బ్రదికియున్నంతకాలము తన కీయ బడిన తాళపుచెవులను వినియోగించనే లేదన్నమాట! అట్లయితే యేసు పేతురుకు రాజ్యపు తాళపు చెవుల నెందుకు యిచ్చినట్లు?

సంఘము లేక రాజ్యము యేసు క్రీస్తు పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకొస్తు దినమున (బైబిలులో అపొ.కార్యములు రెండవ అధ్యాయములో లిఖింపబడినట్లు) స్థాపించబడెను. ఆ దినమున పేతురు రాజ్యము యొక్క తాళపు చెవులను (రక్షణ షరతులను) వినియోగించి మూడువేల మందికి ప్రవేశము కలిగించెను (అపొ.కా. 2:47).

**రాజ్యమునకు, సంఘముకు వున్న గురుతులు ఒక్కటే :**

క్రొత్తనిబంధన చదువుచుండగా ఈ రెండు ఒక్కటే అని మనము తప్పక గ్రహించుకోగలము.

**సంఘముకు, రాజ్యముకు వున్న శిరస్సు ఒక్కరే :**

క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నారు (కొలస్స 1:18) మరియు రాజ్యమునకు రాజు కూడ క్రీస్తే (అపొ. కా. 17:7; రోమా 1:5; 1తిమో 6:15).

ఈ రెండింటిలోనికి ప్రవేశ షరతులు ఒక్కటే :

"ఒకడు నీటిమూలముగాను, ఆత్మ మూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని" యేసు చెప్పెను (యోహాను 3:5). ఆత్మ

యొక్క సువార్తవలన బాప్తిస్మము పొందుట ద్వారా ప్రజలు రాజ్యము లోనికి జన్మిస్తారు. పెంతెకొస్తునాడు అపొస్తులుల వర్తమానము ద్వారా పాపులు విశ్వసించి మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందునట్లు ఆత్మ నడిపించెను (అపో.కా. 2:38). బాప్తిస్మము పొందినవారు సంఘముతో చేర్చబడిరి (అపో.కా. 2:47). రాజ్యములో ప్రవేశించే విధానవే వారిని సంఘములో చేర్చెను. గనుక సంఘము రాజ్యము ఒక్కటే.

**రాజ్యములోను సంఘములోను వున్న సభ్యులు ఒక్కరే :** పరిశుద్ధులు రాజ్య నివాసులుగా చేయబడ్డారని పౌలు చెప్పాడు (కొలస్స 1:13). అది ఆయన శరీరము, సంఘము (కొలస్స 1:18).

**రాజ్యముకు సంఘముకు యున్న విత్తనము ఒక్కటే :** దేవుని వాక్యమే రాజ్యము యొక్క విత్తనము అని యేసు చెప్పారు (మత్తయి 13:19). ఆ విత్తనము రాజ్య నివాసులను తయారుచేస్తాది. దేవుని వాక్యమైన విత్తనము కొరింధులో విత్తబడినప్పుడు (1కొరింధీ 5:1-3). కొరింధులో అనేకులు విని విశ్వసించి బాప్తిస్మము పొందిరి (అపో.కా. 18:8). పౌలు వారిని దేవుని సంఘమని చెప్పాడు (1 కొరింధి 1:2). రాజ్యము సంఘము ఒక్కటేకాకపోతే ఒకే విత్తనము రెండు రకములు వృక్షముల నుత్పత్తి చేయుచున్నది! అది ప్రకృతి లోను, బయల్పాటులోను స్వవిరుద్ధమైనది (ఆది.కా. 1:11; గలతీ 6:7-8).

**రాజ్యముకు, సంఘముకు వున్న చట్టము ఒక్కటే :** పేతురు ఇట్లు చెప్పాడు "ఆయన దైవశక్తి జీవమునకును, భక్తికిని కావలసిన వాటినన్నిటిని మనకు దయచేయుచున్నందున దేవుని గూర్చినట్టియు మన ప్రభువైన యేసును గూర్చినట్టియు ఎక్కువైన అనుభవజ్ఞానము వలన మీకు కృపయు సమాధానమును విస్తరించును గాక" (2పేతురు 1:3). రాజ్యముగాని, సంఘము గాని జీవముకు భక్తికి

కావలసినవి లేక పోయిన యెడల అది అసంపూర్ణ మైనది. అట్లుయినప్పుడు పేతురు చెప్పినది అరెంటికీ వర్తించదు. గనుక ఆ రెంటికీ వున్న చట్టము ఒక్కటే.

## రాజ్యమును / సంఘమును గుర్తించు రూపురేఖలు

1. స్థాపించబడిన ప్రదేశము / తేదీ : యెషయా 2:2–3; అపొ.కా.2: 1–47
2. దాని విస్తీర్ణము : దానియేలు 2:44; మార్కు 16:15
3. దాని యజమానుడు : యోహాను 18:36; మత్తయి 16:18
4. దాని పాలకుడు : 1 తిమో 6:15; ఎఫెసీ 5:23
5. పాలించే చట్టము : యెషయా 2:3; అపొ.కా.2:38–47
6. తాళములు ఇయ్యబడినవారు : మత్తయి 16:19; 18:18
7. సభ్యత్వము : కొలస్స 1:13; 1:2
8. ప్రవేశ షరతులు : యోహాను 3:5; అపొ.కా. 2:38–47
9. దాని మహిమ, ఘనత : యెషయా 2:2,3; ఎఫెసీ 3:21
10. స్మారక భోజనము : మత్తయి 26:29; 1కొరింధీ 11:24,25
11. నమ్మకమునకు ప్రతిఫలం : మత్తయి 2:34; 1 కొరింధీ 15:58
12. విమోచన సమయం : 1 కొరింధీ 1:24, 1థెస్స : 4:16

ఈ రెంటికీయున్న సంగతులన్నియు సమానమే గనుక ఈ రెండు ఒక్క దానినే సూచించుచున్నవి. గనుక సంఘము, రాజ్యము వేర్వేరు కాదు గాని ఆ రెండు ఒక్కటే. యేసు ఒకనితో "నీవు దేవుని రాజ్యమును దూరముగా లేవని చెప్పెను" (మార్కు 12:34).

నీవు రాజ్యముకు సమీపముగా యున్నారా! ఇంకను ప్రవేశింపలేవా? యేసునందు విశ్వాసముంచి, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. ఆయన తన రాజ్యమైన సంఘముతో తక్షణమే నిన్ను చేర్చును. మీకు సమీపముగా యున్న క్రీస్తు సంఘమును దర్శించండి. వారు మీకు తప్పక సహాయము చేయుదురు.

– అలెన్ వెబ్‌స్టర్

# పరిసయ్యుల నుండి యేమి నేర్చుకొనగలము

పరిసయ్యులు తమ కాలమందు చాల నిష్టకలవారు. వారు బైబిలు నందు విశ్వాసముంచిరి. పరిసయ్యుడు అను పదమునకు పాపము నుండి అపవిత్రత నుండి వేరుచేయబడిన వాడని అర్థము. ధర్మశాస్త్రమును పాటించు టలో వారు నిష్ణాతులు మరియు పారం పర్యములను పాటించుటలో ఆసక్తి గలవారు.

అయినను సరే పలు విషయాలను గూర్చి యేసు వారిని గద్దించారు. వారనుసరించు దాని కంటే శ్రేష్టమైన మార్గమును గూర్చి అనేకులు చెప్పుకొనే వారు (మత్తయి 23:2,3). పరిసయ్యులు ఇతరులను నిశితముగా విమర్శించేవారు గాని తమ్మును తాము నీతిమంతుల మనుకొనే వారు (మత్తయి 23:4). వారు మానవ పారంపర్యములు దేవుని వాక్యము కంటే శ్రేష్టమని తలంచుటయేగాక, యితరులపై వాటిని రుద్దేవారు. పారంపర్యములు దేవుని వాక్యముకు విరుద్ధముగా యున్నను సరే వాటిని గౌరవించే వారు (మత్తయి 15:1-9). యేసు వారిలో కొందరిని దోషులని తీర్చారు ఏలయనగా :

**వారు విధేయత చూపుచున్న వానికంటే, వారి విధేయతనే నమ్ముకొనేవారు** : "తామే నీతిమంతులని నమ్ముకొని యితరులను తృణీకరించు వారిని" గూర్చి యేసు ఒక ఉపమానము చెప్పెను (లూకా 18:11). పరిసయ్యుడు తనకు తానే ప్రార్థించుకొనేవాడు (లూకా 18:11). తాను చేసిన పనులను గూర్చి దేవుని యొద్ద గొప్ప చెప్పుకొనేవాడు. ఉపవాసముంటాడు, ప్రార్థిస్తాడు, యితరులకు సహాయమిస్తాడు. అతడు తన ప్రార్థనను బట్టియేమీ పొందలేదు ఏలయనగా అతడు యేమి అడుగలేదు. అతనికి

యేమి అవుసరం లేదని అతడు భావించాడు.

వారి యిష్టప్రకారము ధర్మ శాస్త్రమును కుదించేవారు : ఉపవాస ముండుట, ప్రార్థించుట, దానము చేయుట ప్రత్యేకమైనవి. కొలబద్ధ మైనవి. కొలబద్ధమైన సంగతులను వారు బాగానే చేసేవారు. దశమభాగ ములో వారు పుదీనాను, సోపును యిచ్చేవారు. వీటి విషయంలో వారు తప్పుచేయలేదు. యివి మీరు చేయవలసి యుండెనని యేసు వారికి బోధించారు (మత్తయి 23:23).

కఠినమైన సంగతులను వారు విడిచి పెట్టేసారు : వారు న్యాయమును, కనికరమును, విశ్వాసమును విడిచి పెట్టారు (మత్తయి 23:23). వారు పారంపర్యములను పాటిస్తు ప్రజలను మరిచారు.

వీటి విషయమై మనమును జాగ్రత్తగా యుండాలి. వారు చేసినట్లే మనమును చేసే ప్రమాదమున్నది. దేవుడనుగ్రహించే కృపకు బాప్తిస్మము ద్వారా మనము స్పందించవచ్చును. ప్రతి ఆదివారము ప్రభురాత్రి భోజన మును, వాద్యములు లేకుండా పాటలు పాడుటను, స్థానిక సంఘ ప్రభుత్వము ను పాటించుట ద్వారా మనము దేవునికి విధేయత చూపగలము. వీటిని మీరు చేయవలసి యున్నది యని యేసు చెప్పారు.

అయినను మనము వీటిని చేస్తు, కృప అవుసరము లేదని తలంచిన యెడల, ఈ పనులే మనలను పాపుల నుండి వేరు చేయునని తలంచిన యెడల ప్రాముఖ్య మైన వాటిని మనము జ్ఞాపక ముంచుకోవాలి, యదార్థముగా మనము కనికరము చూపు చున్నామా? తండ్రి లేని వారిని, విధవ రాండ్రను మనం దర్శించు చున్నామా? అందరము మనకు చేతనైనంత సహాయం చేయు చున్నామా? ప్రతి

సహోదరుని సమానముగా ఎంచు చున్నామా? ప్రేమింపబడని వారిని ప్రేమించు చున్నామా? మనలను అగౌరపరచు వారిని సయితము ప్రేమించు చున్నామా? మిగతా మతస్థులను కూడ మన పొరుగు వారిగా చూచుచున్నామా!

ఇవన్నీ ఆలోచిస్తే బహుశ మనం మరింత నమ్మకముగా యుందుము. కనికరము కలిగి యుందుము చివరకు. "ప్రభువా పాపినైన నన్ను కరుణింపుము" అని ప్రార్థించుటకు ప్రోత్సాహింప బడుదుము.

## మనము ఋణస్థులము

రోమా 1:14-18లో అపో. పౌలు ఇట్లు వ్రాసాడు : గ్రీసుదేశస్థులకును, గ్రీసు దేశస్థులు కాని వారికిని జ్ఞానులకును, మూఢులకును నేను ఋణస్థుడను. కాగా నా వలననైనంత మట్టుకు రోమాలోనికి మీకును సువార్త ప్రకటించుటకు సిద్ధముగా యున్నాను. సువార్తను గూర్చి నేను సిగ్గుపడు వాడనుకాను. ఏలయనగా నమ్ము ప్రతి వానికి మొదట యూదునికి గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగ జేయుటకు అది దేవునిశక్తియై యున్నది".

గొప్ప అపొస్తలుడైన పౌలు తన్ను తాను ఋణస్థునిగా ఎంచుకొను చున్నాడు. జ్ఞానులకును, మూఢులకును అతడు ఋణపడి యున్నాడు. ఎందు విషయమై పౌలు వీరికి ఋణపడి యున్నాడు? వారిదగ్గర అప్పుచేసి తీర్చక యున్నాడా? కానే కాదు. సువార్త ప్రకటించు విషయంలో పౌలు వారికి ఋణపడి యున్నాడు. వారి ఆత్మలను రక్షించు శక్తి అది.

సువార్త ప్రకటించుటలో పౌలు మాత్రమే గాక క్రైస్తవులందరు కూడ ఋణపడి యున్నారు, ఏలయనగా

సంఘము సత్యమునకు స్థంభమును దాని ఆధారమునై యున్నది (1 తిమోతి 3:15). సత్యము మనలను స్వతంత్రులు నగా చేయునని యేసు చెప్పెను (యోహాను 8:32). దీనిని బట్టి మానవులు సత్యమును విని దానికి లోబడు వరకు పాప విముక్తులు కారని గ్రాహ్యమగుచున్నది. యోహాను 8:32లో యున్న స్వతంత్రము పాపము నుండియా? యని కొందరడుగుదురు. రోమా 6:17 ఇట్లు చెప్పుచున్నది : "మీరు పాపమునకు దాసులై యుంటిరి గాని యేఉపదేశ క్రమమునకు మీరు అప్పగింప బడితిరో దానికి హృదయ పూర్వకముగా లోబడినవారై పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి. ఇందుకు దేవునికి స్తోత్రము.

గనుక చదువరీ మనము ఋణ పడి యున్నామని గ్రహించగోరు చున్నాను. ఈలోకమునకంతటికిని సువార్త ప్రకటించుటకు మనము ఋణ పడి యున్నాము. అంతమాత్రమే కాదు దేవుడు పక్షపాతి కాదు అని గ్రహించిన తరువాత సర్వజనాంగానికీ సువార్త ప్రకటించుటలో ఋణపడి యున్నాము.

మొదటిగా మనము తండ్రియైన దేవునికి, కుమారుడైన యేసుక్రీస్తుకు ఋణపడి యున్నాము. ఏలయనగా, "దేవుడు లోకమునెంతో ప్రేమించెను కాగా ఆయన తన అద్వితీయ కుమారుని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయననుగ్రహించెను" (యోహాను 3:16). మరల "ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించు చున్నాము" (1 యోహాను 4:19). "అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు; ఎట్లనగా మన మింకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను" (రోమా 5:8).

క్రైస్తవులమైన మనము ఒకరి నొకరు ప్రేమించుటలోను, గౌరవించుటలోను ఋణపడి యున్నాము (1 పేతురు 1.22-23). ప్రేమ ఆజ్ఞాపింప బడినది. ఎంతమందిని మనము ప్రేమించాలి? "అందరిని సన్మానించుడి, సహోదరులను ప్రేమించుడి" (1 పేతురు 2:17).

క్రీస్తు యొక్క వధువును ప్రేమించుటలో మనము ఋణపడి యున్నాము. ఆ వధువే క్రీస్తుసంఘము! పరిశుద్ధలేఖనములను మనకిచ్చినందున పరిశుద్ధాత్మకును, అపొస్తులులకును, లేఖకులకును మనము ఋణపడి యున్నాము. మంచి క్రైస్తవ పాఠశాలలకు, కాలేజీలకు మనము ఋణపడి యున్నాము. మన సంఘ పెద్దలకు, సువార్తికులకు ఋణపడి యున్నాము. ఇంకా ఎంతమందికి ఋణపడి యున్నామో మనం చాలచెప్పుకొనవచ్చును. మనం ఋణస్థులమని ఎల్లవేళలా జ్ఞాపకముంచుకొనుడి!

-జాన్ హేరిస్


## సత్యవాణి స్కూల్ ఆఫ్ ఇవాంజలిజం

### బైబిలు తరగతులు

మేము అందరికి రెండు నెలలు పాటు బైబిలు తరగతులు జూమ్ ద్వారా ఉచితముగా జరుపుటకు నిర్ణయించితిమి

సోమవారం నుండి శుక్రవారం వరకు ఉదయం 8 గం॥ల నుండి మధ్యాహ్నం 12 గం॥ల వరకు క్లాసులు జరుగును.

కోర్సు పూర్తిచేసిన తరువాత అర్హులైన విద్యార్థులకు స్టైఫండ్ మరియు సర్టిఫికెట్ ఇవ్వబడును.

కావున ఆసక్తి గలవారు

**0884-2363722, 9848998547** గాని సంప్రదించండి.